సాక్షి
నాగర్‌కర్నూల్

శనివారం । 21 । జూన్ । 2025



వేగవంతంగా విద్యుదుత్పత్తి

జూరాల జలాశయానికి వరద పెరగడంతో 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి చేపడుతున్నారు.

వివరాలు 8లో ▸



జాతీయ హోదా ఇవ్వాలి

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని విజ్జు కృష్ణన్ డిమాండ్ చేశారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.7 /22.4

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపా దడపా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళా అధ్యాపకుల నియామకం

కందనూలు: జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాల, రంగారెడ్డి షాద్‌నగర్ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న టీజీఎస్‌డబ్ల్యూఆర్డీసీ (ఉమెన్)లో బోధించుటకు అర్హులైన మహిళా అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ, స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, హిస్టరీలో ఖాళీలు ఉన్నాయని, పీజీలో 55 శాతం మార్కులు, నెట్, సెట్ ఉత్తీర్ణులై మూడేళ్ల బోధనానుభవం ఉన్న వారు జూన్ 25వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 95029 63320, 77939 75030 సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యలపై పోరాడే పార్టీ సీపీఐ



పెద్దకొత్తపల్లి: ప్రజా సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. శుక్రవారం మండలంలోని వెన్నచర్లలో జరిగిన పార్టీ మండల 18వ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వందేళ్లుగా ఓట్లు, సీట్లు, అధికారంతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటం చేస్తున్నామన్నారు. దేశంలో రెండు దశాబ్దాలు అధికారంలో ఉన్న పార్టీలు నేడు కనుమరుగయ్యే పరిస్థితి కనబడుతుందని.. ఓడిన పార్టీల నాయకులు అధికారం కోసం గెలిచిన పార్టీల్లో చేరుతూ అధికారాన్ని అస్వాదిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భూ స్వాములు, పెత్తందారుల కొమ్ము కాస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు గ్రామంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండీ ఫయాజ్, కార్యవర్గసభ్యుడు నర్సింహ, పెబ్బేటి విజయుడు, కార్యదర్శి బొల్లెందుల శ్రీనివాసులు, బండి లక్ష్మీపతి, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, మజీద్, రామచంద్రయ్య, వెంకటేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి'



నాగర్‌కర్నూల్ రూరల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోందని.. బీసీలను అవమానించేందుకు చూస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ ఆరోపించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని.. అవమానకర రాజకీయాలు ఎవరు చేసినా బీసీ సమాజం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధుల నియంత్రణ

బిజినేపల్లి: సీజనల్ వ్యాధులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. వెంకటదాస్ అన్నారు. శుక్రవారం ఉదయం పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవడంతో పాటు దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ప్రియాంక, వైద్య, ఆరోగ్య సిబ్బంది నర్సింహులు, బాదం రాజేశ్వర్, సుజాత, గజవర్ధనమ్మ, విజయ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



1,282 గ్రామాలు.. 43,047 అర్జీలు

ఉమ్మడి జిల్లాలో ముగిసిన భూ భారతి సదస్సులు

- నాగర్‌కర్నూల్‌లో అత్యధికంగా 15,599 దరఖాస్తులు
- నారాయణపేటలో అత్యల్పంగా 4,052

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ధరణిలో తప్పులను సవరిస్తూ.. మార్పులు, చేర్పులతో భూ భారతి పోర్టల్‌ను అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించింది. నిర్దేశిత గడువు శుక్రవారంతో ముగియగా.. మొత్తంగా ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల పరిధిలో 1,282 గ్రామాలకు సంబంధించి 43,047 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 15,559 అర్జీలు రాగా.. నారాయణపేట జిల్లాలో అత్యల్పంగా 4,052 వచ్చినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.

జిల్లాల వారీగా ఇలా..

⇨ మహబూబ్‌నగర్ జిల్లాలోని 16 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అత్యధికంగా కోయిల్‌కొండ మండలంలో 1,317 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 2,348, భూ విస్తీర్ణంలో తప్పులపై 966, భూ యజమాని పేర్లలో తప్పులు సవరించాలని 435 అర్జీలు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

⇨ నారాయణపేట జిల్లాలోని 12 మండలాల పరిధిలో రెవెన్యూ సదస్సులు జరగగా.. నారాయణపేట మండలంలో అత్యధికంగా 1,230 అర్జీలు వచ్చాయి. ప్రధానంగా మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 1,284, భూ విస్తీర్ణంలో తప్పులపై 776, పేర్లలో తప్పులు సవరించాలని 335 మంది దరఖాస్తు చేసుకున్నారు.

⇨ జోగుళాంబ గద్వాల జిల్లాలోని 12 మండలాల పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గద్వాల మండలంలో అత్యధికంగా 1,324 అర్జీలు వచ్చాయి. మిస్సింగ్ సర్వే నంబర్లు సవరించాలని 832, పెండింగ్ సక్సేషన్లపై 750, అసైన్డ్‌మెంట్ ల్యాండ్‌లపై 640, గెట్ల పంచాయితీలపై 200 వరకు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

⇨ నాగర్‌కర్నూల్ జిల్లాలో 19 మండలాల పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 15,559 దరఖాస్తులు వచ్చాయి. కొల్లాపూర్ మండలం నుంచి అత్యధికంగా 2,138 అర్జీలు వచ్చినట్లు తెలుస్తోంది. మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 3,921, భూ విస్తీర్ణంలో తప్పులపై 1,062, పేర్లలో తప్పులు సవరించాలని 478 మంది దరఖాస్తు చేసుకున్నారు.

⇨ వనపర్తి జిల్లాలోని 15 మండలాల్లో రెవెన్యూ సదస్సులు జరిగగా.. అత్యధికంగా పాన్‌గల్ మండలంలో 1,555 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా మిస్సింగ్ సర్వే నంబర్లపై 1,135, భూ విస్తీర్ణంలో తప్పులపై 1,064, పేర్లలో తప్పులకు సంబంధించి 824 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



తాడూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

జిల్లాల వారీగా సదస్సులు, దరఖాస్తుల వివరాలు..

జిల్లా	సదస్సులు నిర్వహించిన గ్రామాలు	వచ్చిన దరఖాస్తులు
మహబూబ్‌నగర్	293	9,610
జోగుళాంబ గద్వాల	198	5,800
నాగర్‌కర్నూల్	338	15,559
నారాయణపేట	234	4,052
వనపర్తి	219	8,026

మత్తు వదిలిస్తున్నారు!



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ (ఫైల్)

నియంత్రణకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు

- గ్రామాలు, పట్టణాల్లో యువతకు అవగాహన సదస్సులు
- డ్రగ్స్ నివారణకు నిరంతరం తనిఖీలు



నాగర్‌కర్నూల్ క్రైం: సమాజంలో మత్తుకు బానిసై ఎందరో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. డ్రగ్స్‌కు అలవాటైన వారిలో ఎక్కువ శాతం యువతే ఉండటం.. వారు అసాంఘిక కార్యకలాపాలతో పాటు నేరాలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తున్న విషయం. మత్తు పదార్థాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. మత్తు పదార్థాలు విక్రయించే, వినియోగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

వీడియో ప్రదర్శనలతో..

జిల్లాలోని 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలలు, కళాశాలలు, రద్దీ ప్రాంతాల్లో మత్తు బారిన పడితే కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీడియోలను ప్రదర్శిస్తూ వివరిస్తున్నారు.

ప్రత్యేక నిఘా..

జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లో గంజాయి సాగు, రవాణా జరగకుండా, ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి మత్తు పదార్థాలు రాకుండా జిల్లా ఎక్సైజ్, పోలీసుశాఖ సంయుక్తంగా నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొందరు యువత పట్టణాలు, మండల కేంద్రాల శివార్లను అడ్డాలుగా చేసుకొని మత్తు పదార్థాలు సేవిస్తుండటంతో వారిపై ప్రత్యేక నిఘా ఉంచి అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

కఠినంగా వ్యవహరిస్తాం..



మత్తు పదార్థాలు వినియోగించే, విక్రయించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. మత్తు పదార్థాలను కట్టడి చేసేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ

జిల్లాలో గంజాయి కేసుల నమోదు ఇలా..

⇨ 2022లో 7 కేసులు నమోదు చేసిన పోలీసులు 3.208 కిలోల గంజాయి, 4 కిలోల గంజాయి విత్తనాలు స్వాధీనం చేసుకొని 8 మందిని అరెస్టు చేశారు.

⇨ 2023లో మూడు కేసులు నమోదు చేసి 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని 10 మందిని అరెస్టు చేశారు.

⇨ 2024లో 7 కేసులు నమోదు చేసి 309 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని 12 మందిని అరెస్టు చేశారు.

⇨ 2025లో ఇప్పటి వరకు రెండు కేసుల్లో 920 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు.

ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

- సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, సీజనల్ వ్యాధులు, తెలంగాణ వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యాన పంటలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ, ప్రాజెక్టుల నిర్మాణానికి భూ సేకరణలో జాప్యం కాకుండా చూస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. అంటువ్యాధుల నివారణకు ముందస్తుగా మందుల నిల్వ, వైద్యబృందాల సన్నద్ధత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సామర్థ్యం పెంచే చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని, నిర్లక్ష్యం సరికాదని హెచ్చరించారు. తెలంగాణ వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి పట్టణ ప్రాంతాల వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని వ్యవస్థాత్మకంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటల సాగుపై కలెక్టర్ సమీక్షించారు. సాగు విస్తీర్ణం, రైతులకు అందుతున్న సాంకేతిక సాయం, మార్కెటింగ్, నీటి లభ్యతపై అధికారులతో చర్చించారు. రైతులకు ప్రోత్సాహకాల అమలుపై కూడా ఆరా తీశారు.

2,71,545 మంది రైతుల ఖాతాల్లో రూ.308 కోట్లు జమ..

రైతు భరోసా పథకంలో భాగంగా శుక్రవారం వరకు జిల్లాలోని 2,71,545 మంది రైతుల ఖాతాలో రూ.308.792 కోట్లు జమ అయ్యాయని కలెక్టర్ బదావత్ సంతోష్ ఓ ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్ కంటే ముందే నిధులు జమ చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని.. పెట్టుబడి భారం తగ్గించి ఉత్పాదకత పెంపొందించేందుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. విడతల వారీగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతాయని వివరించారు.

'సంకెళ్ల ఘటన'లు పునరావృతం కానివ్వం



వివరాలు వెల్లడిస్తున్న ఐజీ సత్యనారాయణ

- కానిస్టేబుళ్ల అతి జాగ్రత్తతోనే తప్పిదం జరిగింది
- మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ

మహబూబ్‌నగర్ క్రైం: జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ కోర్టుకు రైతులను తీసుకువెళ్తున్న ఘటనలో రైతుల చేతులకు సంకెళ్లు వేయడంపై ఎస్కార్ట్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్ల అతి జాగ్రత్తతోపాటు ఎక్కువగా రక్షణాత్మకంగా ఉండాలని వ్యవహరించడం వల్లే ఈ తప్పిదం జరిగిందని మల్టీ జోన్- 2 ఐజీ సత్యనారాయణ అన్నారు. అలంపూర్, సంగారెడ్డి కోర్టులలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని, భవిష్యత్‌లో ఇలాంటివి మళ్లీ జరగకుండా ప్రత్యేక ఎస్‌ఓటీ తయారు చేసినట్లు వెల్లడించారు. మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐజీ మాట్లాడారు. ఉన్నతాధికారులకు విషయం తెలియకపోవడంతోపాటు స్థానిక ఎస్‌హెచ్‌ఓ సక్రమంగా మానిటరింగ్ చేయకపోవడం వల్లే ఇలా జరిగిందన్నారు. రైతుల ఘటన విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదని, ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో ఎక్కడా కూడా ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండటానికి ఎస్‌ఓటీ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, దీనికి సివిల్ డీఎస్పీతోపాటు ఏఆర్ డీఎస్పీ పూర్తి బాధ్యత వహిస్తారని చెప్పారు. కొత్తగా వచ్చిన బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం ఖైదీలకు ఇచ్చే ఎస్కార్ట్ విషయంలో ఆస్పత్రికి వెళ్లే సమయంలో కొన్ని నిబంధనలు ఉన్నాయని జైలు అధికారుల నుంచి ఎస్పీలకు సమాచారం వస్తుందన్నారు. ఖైదీలను తరలించే సమయంలో సమన్వయ, సమాచారం లోపం ఉండకుండా ఉండటానికి ఎస్పీ స్థాయిలో ఎస్‌బీ, లా అండ్ ఆర్డర్, రిజర్వ్ పోలీసులు కలిసి అన్ని జాగ్రత్తలు తీసుకునే క్రమంలోనే నూతనంగా ఎస్‌ఓటీ తయారు చేశామన్నారు. జైలు నుంచి ఖైదీలను ఆరోగ్య పరీక్షల కోసం ఆస్పత్రికి లేదా కోర్టుకు తీసుకువెళ్తున్న క్రమంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఇకపై జైలు నుంచి ఖైదీలను తీసుకువెళ్తున్న క్రమంలో వారి గత నేర చరిత్ర ఆధారంగా చేసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంకెళ్ల విషయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రైతులు, వికలాంగులు, విద్యార్థులు, మహిళలను కోర్టుకు తీసుకువెళ్తున్న క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై ఐదు జిల్లాల పోలీస్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. సంకెళ్లు వేయాల్సిన పరిస్థితి వస్తే సదరు కోర్టు న్యాయమూర్తి అనుమతి ప్రకారం వేయాలని, అదేస్థాయిలో బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం టెర్రరిస్టులు, నక్సలైట్లు, గతంలో నేర చరిత్ర కలిగినవారు అయితే పోలీస్ ఉన్నతాధికారుల అనుమతి కూడా తీసుకోవాలన్నారు. పెద్దధన్వాడ ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, అదే సమయంలో రైతుల అభిప్రాయాలు సైతం సముచితంగా తీసుకొని చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కసారి ఖైదీలను రిమాండ్ చేసిన తర్వాత మళ్లీ తర్వాత బెయిల్ అప్లికేషన్ సందర్భంతోపాటు ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం వెళ్లిన సందర్భంలో ముఖ్యంగా లా అండ్ ఆర్డర్ పోలీసులు వాటిపై తక్కువ ఫోకస్ పెడుతున్నారని తెలిపారు. సమావేశంలో జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఉమ్మడి జిల్లాలోని ఎస్పీలు జానకి, వైభవ్ గైక్వాడ్, రావుల గిరిధర్, తోట శ్రీనివాస్‌రావు, యోగేష్ గౌతం పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కల్వకుర్తి టౌన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు వారి సలహాలు, సూచనలను సెల్‌నంబర్ 99592 26292లో సంప్రదించి తెలియజేయాలని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

బడుల బలోపేతంలో ఉపాధ్యాయులే కీలకం



సూరాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థితో పాఠం చదివిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

లింగాల: విద్యా ప్రమాణాలు పెంచడం, నాణ్యమైన బోధన అందించడంలో ఉపాధ్యాయులే కీలకమని.. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాకారం, సూరాపూర్, మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, విద్యార్థులు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగే విధంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇప్పటికే విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేసినట్లు చెప్పారు. విద్యా ప్రమాణాల పెంపునకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

బల్మూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సన్నద్ధం కావాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని జినుకుంటలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్గత విభేదాలు వీడి ప్రతి ఒక్కరూ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా సంఘటితంగా పని చేయాలని సూచించారు. గ్రూపు తగాదాలను ప్రోత్సహించే వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేసే వారికి పదవులు పైరవీలు లేకుండా వస్తాయన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలుగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వారికి ప్రథమ రూ.20 లక్షలు, ద్వితీయ రూ.15 లక్షలు, తృతీయ రూ.10 లక్షలు అభివృద్ధి పనులకు తనవంతుగా అదనంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకుంటే క్షమించేది లేదని హెచ్చరించారు. జులై మొదటి వారంలో ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడత లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని తెలిపారు. వానాకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 10 ఎకరాలలోపు ఉన్న 93 శాతం మంది రైతులకు ప్రభుత్వం రైతుభరోసా నిధులు జమ చేస్తుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ గిరివర్ధన్‌గౌడ్, నాయకులు కాశన్నయాదవ్, సుధాకర్‌గౌడ్, నర్సింగ్‌రావు, నిరంజన్‌గౌడ్, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు రాంప్రసాద్‌గౌడ్, శైలేష్, ఖదీర్, సంపంగి రమేష్, శ్రీనివాసులు, వెంకటయ్య, పద్మ, సైదులు, అశోక్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ వ్యవస్థ ఎంతో కీలకం



స్టాళ్లను ప్రారంభిస్తున్న సీడీఎంఏ టీకే శ్రీదేవి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మనిషికి శ్వాస ఎంత ముఖ్యమో.. పట్టణాలు, నగరాలకు మున్సిపల్ వ్యవస్థ అంతే ముఖ్యమని సీడీఎంఏ టీకే శ్రీదేవి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని శిల్పారామంలో 'తెలంగాణ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్- స్టార్టప్ సమ్మిట్' నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ 'వంద రోజుల ప్రత్యేక కార్యాచరణ'లో చేసే పనులు వినూత్నంగా ఉండాలన్నారు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుద్ధ్యం, వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ, నీటి శుద్ధికి సంబంధించి కొత్త ఆవిష్కరణలతో వివిధ స్టార్టప్ కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వీటిని ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలని, అందరూ వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. మున్సిపాలిటీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపైనే ఆధారపడకుండా స్థానికంగా ఆర్థిక వనరులు పెంచుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్సు ఫీజు, దుకాణాల అద్దెలను సకాలంలో వసూలు చేసి ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణాలు, నగర ప్రాంతాల్లో వేస్టేజీ ఎక్కువగా ఉంటోందని దీనివల్ల వాతావరణ, నీటి, వాయు కాలుష్యం ఉత్పన్నమవుతోందన్నారు. వీటిని తగ్గించడానికి కొత్త ఆవిష్కరణలపై అధ్యయనం చేసి అమలయ్యేలా చూస్తామన్నారు. అంతకు ముందు శిల్పారామం ఆవరణలో ఏర్పాటు చేసిన 40 స్టాళ్లను పరిశీలించారు. కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికపై బాలుడి అత్యాచారం

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

జడ్చర్ల: పక్కింట్లో ఉంటున్న అభంశుభం తెలియని బాలిక(10)పై బాలుడు(16) అత్యాచారం చేసిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదే గ్రామంలో 5వ తరగతి చదువుతుంది. ఈ క్రమంలో పక్క ఇంట్లో ఉండే బాలుడు వారం రోజుల క్రితం ఒంటరిగా ఉన్న బాలికపై లైంగిక దాడి చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతోపాటు అనారోగ్యానికి గురైంది. అయితే బాలికతోపాటు తల్లి వెంటనే విషయం బయటకు చెప్పలేక పోయారు. రెండు రోజుల తర్వాత బాలిక ఆరోగ్యం విషమించడంతో 108లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలికను పరీక్షించిన వైద్యులు అత్యాచారం జరిగినట్లు అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు జడ్చర్ల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక సీఐ కమలాకర్ విచారణ చేపట్టారు. బాలికపై ఇంటి పక్కనే ఉన్న బాలుడు లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ జానకి జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విచారించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని స్థానిక పోలీసులను ఎస్పీ ఆదేశించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా.. బాలుడు ఇటీవలే పదో తరగతి పూర్తిచేశాడు.

చికిత్స పొందుతూ తాపీమేస్త్రి మృతి



కుమ్మరి రవి (ఫైల్)

అయిజ: అనారోగ్యానికి చికిత్స పొందేందుకు ఆర్థిక ఇబ్బందులు.. కడుపులో నొప్పులు భరించలేక గడ్డిమందు తాగిన తాపీమేస్త్రి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని యాపదిన్నెలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి ఎల్లమ్మకు అయిజకు చెందిన కుమ్మరి రవి(35)తో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. అత్తగారి గ్రామమైన యాపదిన్నెలో తాపీమేస్త్రి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కిడ్నీ, లివర్ సమస్యతో బాధపడుతూ డాక్టర్ల చుట్టూ తిరగడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఓ వైపు కడుపులో నొప్పులు అనారోగ్యం, మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం గ్రామ సమీపంలోని వాగు వద్ద గడ్డిమందు తాగాడు. గమనించిన కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా.. గద్వాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు రెఫర్ చేశారు. చికిత్స పొందు తూ గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్ర వారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి తండ్రి సాయిలన్న, భార్య ఎల్లమ్మ, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు మృతి చెందడంతో ఎల్లమ్మ కుటుంబం రోడ్డున పడింది. ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

భూతగాదాల్లో పలువురిపై కేసు నమోదు

నవాబ్‌పేట: మండల కేంద్రానికి చెందిన మల్తుంకార్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని 750 సర్వే నెంబర్‌లో మూడేళ్ల క్రితం శ్రీనివాస్ పొలం కొనుగోలు చేశాడు. ఆ భూమిలో వేసిన ఫెన్సింగ్‌ను గ్రామానికి చెందిన కారుకొండ రాజు, జంగయ్య, శ్రీశైలం, కేశవులు తొలగించారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసునమోదు చేసినట్లు తెలిపారు.

కారుకొండలో..

మండలంలోని కారుకొండలో ఇద్దరు సోదరుల మధ్య భూవివాదంలో గొడవ చోటుచేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు. గ్రామానికి చెందిన బండారి పద్మమ్మ తన పేరున ఉన్న 4:30 గుంటల భూమిని ఇద్దరు కుమారులకు రెండెకరాల చొప్పున పట్టా చేయించింది. శుక్రవారం చిన్న కుమారుడు నరేశ్‌తో పాటు పొలంలో విత్తనాలు వేస్తుండగా.. పెద్ద కుమారుడు వెంకటేశ్ వచ్చి తనతోపాటు చిన్నకుమారుడిపై దాడిచేసి సాగుకు ఆటంకం కల్పించాడని బాధితురాలు పద్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వెంకటేశ్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

31 ఏళ్లుగా..

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ ప్రేమ్‌కుమార్ 1994లో 'ప్రేమ్స్ హెల్త్‌క్లబ్' ఏర్పాటు చేసి ఉచితంగా యోగాలో శిక్షణ అందిస్తున్నారు. జిల్లా కేంద్రంలో 31 ఏళ్లుగా వేలాదిమందికి యోగాసనాలు చేయించారు. ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, అధికారులు ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 6.30 వరకు ప్రేమ్స్ హెల్త్‌క్లబ్‌లో యోగా శిక్షణ తీసుకుంటున్నారు. క్లబ్‌లో 50 ఏళ్లుపైబడిన వారు కూడా చురుగ్గా యోగా చేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని డాక్టర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు.



యోగాసనాలు వేస్తున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్

76 ఏళ్ల వయస్సులో యోగాసనాలు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి రిటైర్డ్ లెక్చరర్ జి.పాండురంగం 76 ఏళ్ల వయస్సులో యోగాసనాలు చేస్తూ చురుగ్గా, ఆరోగ్యంగా ఉంటున్నారు. ఉడిత్యాలకు చెందిన నరసింహారావు వద్ద యోగా నేర్చుకొని 1983 నుంచి ప్రతి రోజు యోగాసనాలు చేస్తున్నారు. వాకింగ్, యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ కొంతమంది మిత్రులతో కలిసి 1998లో జిల్లా కేంద్రంలో సుప్రభాత్ హెల్త్‌క్లబ్ ఏర్పాటు చేశారు. యోగాపై ఆసక్తితో పాండురంగం పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో 2010లో హరిద్వార్‌లో ప్రత్యేక యోగా శిక్షణ తీసుకున్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సీనియర్ సిటిజన్లకు యోగా **శిక్షణ అందిస్తున్నారు.**



యోగా సాధనలో జి.పాండురంగం

కరాటే, యోగా గురువు వెంకటేశ్...



యోగాసనాలు చేస్తున్న వెంకటేశ్

జిల్లా కేంద్రానికి చెందిన కోటకదిర వెంకటేశ్ కరాటేతో పాటు యోగా మాస్టర్‌గా పేరొందారు. విద్యార్థులకు కరాటే శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రత్యేకంగా యోగాలో శిక్షణ అందజేస్తున్నారు. ప్రతి ఏడాది జిల్లా కేంద్రంలో కరాటే, యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్ కరాటేలో 1997లో బ్లాక్ బెల్టు అందుకున్నారు. బాలకిష్టయ్యగౌడ్ వద్ద యోగా నేర్చుకున్నారు. 24 ఏళ్ల నుంచి నిత్యం మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కరాటే, యోగాలో శిక్షణ అందిస్తున్నారు. 2023లో జిల్లా కేంద్రం మీదుగా సాగిన భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ ఎదుట యోగా విన్యాసాలు ప్రదర్శించి, మన్ననలు పొందారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు.

యోగాతో ఒత్తిడి దూరం



కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌లో నిత్యం 10 నిమిషాల పాటు సాధన	సత్ఫలితాలు ఇస్తున్న శిక్షణ	మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం

జడ్చర్ల టౌన్: తనువు, మనస్సు, ఆత్మను ఏకం చేసే గొప్ప సాధనమే యోగా. దీంతోపాటు ఆరోగ్యం, ఏకాగ్రత లభిస్తుందని జడ్చర్ల మండలం కోడ్గల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిరూపిస్తున్నారు. యోగ, ధ్యానం జీవితంలో ఒక భాగం కావాలని భావించిన అక్కడి ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్‌గౌడ్ నిత్యం పాఠశాలలో ప్రార్థన సమయంలో 10 నిమిషాలు విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రతిరోజు సూర్యనమస్కారాలు, మయూరాసనం, శీర్షాసనం, పద్మాసనం, వజ్రాసనంతో పాటు 60 రకాల ఆసనాలు వేస్తున్నారు. యోగాసనాలతో శరీరంలోని అనేక రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. మండలంలో ఉన్న అన్ని గురుకులాల్లోనూ విద్యార్థులు యోగ సాధనలో శిక్షణ పొందడంతో పాటు రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలో సత్తా చాటుతున్నారు.



ఆసనాలు వేస్తున్న విద్యార్థినులు

గతేడాది ప్రపంచ రికార్డులో భాగస్వామ్యం

ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని హోబిల్ట్ వరల్డ్ రికార్డ్ యూనియన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ రికార్డ్ మెడిటేషన్ ఈవెంట్ (వర్చువల్)లో కోడ్గల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్‌గౌడ్ నేతృత్వంలో ప్రపంచ రికార్డులో భాగస్వామ్యం అయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ నుంచి సర్టిఫికెట్ సైతం పొందారు.



యోగాసనాలు వేస్తున్న కోడ్గల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో..

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో పతాంజలి యోగాసమితి ఆధ్వర్యంలో మూడు దశాబ్దాల క్రితం యోగా శిక్షణ ప్రారంభించారు. అనంతరం సంజీవని యోగాసమితి, ఆర్యవైశ్య సంఘాలు యోగా తరగతులు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఫ్లెవైాక్ అసోసియేషన్ మాత్రం రెండేళ్లుగా అంతర్జాయతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మినీ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

నీటిపై సాధన



నీటిపై యోగాసనాలు వేస్తున్న దోకూర్ కవిత

అచ్చంపేట: పట్టణానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ డోకూరు కవిత యోగా మాస్టర్‌గా గుర్తింపు పొందారు. ఈమె పదేళ్లుగా విద్యార్థులు, యోగా సాధకులకు శిక్షణ ఇస్తున్నారు. అదేవిధంగా నీటిపై యోగా ఆసనాలు వేసి అందరినీ అబ్బురపరుస్తున్నారు. యోగా విద్యను అందరికీ అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు ఆమె చెబుతున్నారు.

యోగా 'ఏకలవ్యుడు'

నవాబుపేట: మండలంలోని మరికల్‌కు చెందిన పురుషోత్తం మూడు పర్యాయాలు జాతీయ పోటీలకు ఎంపికై, 8 సార్లు రాష్ట్ర స్థాయి మొదటి బహుమతులు పొందాడు. గురువు లేకుండానే కేవలం టీవీలో చూడటం, పుస్తకాలు చదవటంతో ఆసనాలు వంట పట్టించుకుని పురుషోత్తం గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి ఏకలవ్యుడిగా ఎదిగాడు. పురుషోత్తం తనతో పాటు భార్య నిర్మల, కుమార్తె ఝాన్సీరాణి, కుమారుడు చరణ్‌కు సైతం యోగాలో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే కుమార్తె, కుమారుడు పాఠశాల, కళాశాల సో జిల్లా స్థాయి పతకాలు సాధించారు. భార్య మరికల్‌లో మహిళలకు యోగా నేర్పుతున్నారు.



పురుషోత్తం యోగా విన్యాసాలు

- 2014లో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి బహుమతి.
- నిజామాబాద్‌లో రాష్ట్ర స్థాయి ద్వితీయ పతకం.
- రాష్ట్ర స్థాయి బంగారు పతకం. అదే ఏడాది దక్షిణ భారతదేశ జాతీయ స్థాయి పోటీల్లో మొదటి బహుమతి సాధించి బంగారు పతకం పొందాడు.
- 2017-2018 సంవత్సరానికి సంబంధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని నాల్గవ స్థానం సాధించాడు.

నైతిక విలువలు పెరిగాయి



ఏడాది కాలంగా ప్రతిరోజు ప్రార్థన సమయంలో యోగ, ధ్యానం చేయటం వల్ల నాలో నైతిక విలువలు పెరిగాయి. పక్కవారితో ఎలా నడుచుకోవాలి అని నేర్చుకున్నా. గతంలో ఏదో తెలియని భయం నన్ను వెంటాడేది. యోగాసనాలు వేయటం వల్ల ఇప్పుడది పూర్తిగా పోయి, ఒత్తిడిని జయించగలుగుతున్నాను.

– శరత్, 9వ తరగతి విద్యార్థి, ఈర్లపల్లితండా

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తున్నా



పాఠశాలలో ఏడాది నుంచి ప్రతిరోజు యోగసాధన చేయటం వల్ల నాలో ఆత్మ విశ్వాసం పెరిగింది. భయం పోయి మానసికంగా ఎంతో ధైర్యం వచ్చింది. క్లాసులో ప్రథమ స్థానంలో నిలిచేందుకు యోగ, ధ్యానం ఉపయోగపడింది.

– అంబిక, పదో తరగతి, కోడ్గల్

మనోధైర్యం పెరిగింది




ప్రతిరోజు ప్రార్థన సమయంలో యోగ సాధన చేయించటం వల్ల విద్యార్థుల్లో మనోధైర్యం పెరిగింది. వారిలో వ్యక్తిత్వ వికాసం పెంపొందడంతో పాటు ఒత్తిడిని జయించి చదువులో రాణిస్తున్నారు. గతేడాది నిర్వహించిన వర్చువల్ తరగతుల్లో కోడ్గల్ హైస్కూల్ విద్యార్థులు, నేను పాల్గొని వరల్డ్ రికార్డులో భాగస్వామ్యం అయ్యాం.

– రవికుమార్‌గౌడ్, ఫిజికల్ డైరెక్టర్, కోడ్గల్ హైస్కూల్

నిరంతర 'యోగా' సాధకుడు

నర్వ: మండలంలోని కొత్తపల్లికి చెందిన యోగా మాస్టర్ రామాంజనేయులు పాఠశాల స్థాయి నుంచే యోగాసానాలు వేసేవాడు. ఇంటర్ తర్వాత కేరళలోని సెంట్రల్ యూనివర్సిటీలో యోగాపై పీజీ డిప్లొమా పూర్తి చేశారు. అనంతరం రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీలో యోగా థెరఫీలో పీజీ చేశాడు. తమిళనాడు, ఢిల్లీలో ఇషా ఫౌండేషన్‌లో మూడు నెలల పాటు యోగాపై ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో యోగా కోర్సుపై గెస్ట్ కోఆర్డినేటర్‌గా, ఆయుష్ ఇన్‌స్ట్రక్టర్ విభాగంలో కాంట్రాక్టు ప్రాతిపాదికన మరికల్ మండలంలోని కన్మనూర్ ఆయుష్ డిస్పెన్సరీలో విధులు నిర్వహిస్తున్నాడు.



యోగాసనాలు ప్రదర్శిస్తున్న రామాంజనేయులు

పేదల ఇళ్ల కూల్చివేతలు దుర్మార్గం

● బాధితులకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి
● మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్



కూల్చిన ఇళ్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్ తదితరులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయం సమీపంలో అక్రమ నిర్మాణాల పేరిట దేవాదాయశాఖ అధికారులు కోర్టును అడ్డుపెట్టుకొని పేదలకు సంబంధించిన 34 ఇళ్లను కూల్చడం దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ బాధితులకు కనీసం సమయం కూడా ఇవ్వకుండా అధికారులు, పోలీసు బలగాలతో ఇళ్లను తొలగించడం దారుణమన్నారు. అచ్చంపేట నియోజకవర్గం బిడ్డ ముఖ్యమంత్రి అయిండు, ఈప్రాంత అభివృద్ధి జరుగుతుందని ఊహించిన ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి బాధితులకు తక్షణమే పునరావాసం కల్పించి, ఇళ్ల నిర్మాణానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

మాజీ సర్పంచ్‌ల ఔదార్యం

సిర్సనగండ్ల మాజీ సర్పంచ్‌లు యాతం శ్రీనివాసులు, యాతం శారద తమ సొంత భూమిలో బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, మరొక గుట్ట దిగువన అయోధ్య నగరంగా ఏర్పాటు చేస్తామని ముందుకు రావడంతో బాధితులు, మాజీ ఎమ్మెల్యేలు వారిని అభినందించారు. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బాధితుల ఇంటి నిర్మాణాలకు రూ.2 లక్షల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా నిత్యావసర సరకుల కోసం రూ.2 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, కొమ్ము శ్రీనివాస్ యాదవ్, రవీందర్, మాజీ జెడ్పీటీసీలు రవి, రాంబాబు, కోఆప్షన్ మాజీ సభ్యుడు సలీం తదితరులు ఉన్నారు.

200 గ్రాముల గంజాయి స్వాధీనం

ముగ్గురు యువకుల రిమాండ్



గంజాయితో పట్టుబడిన యువకులు

మహబూబ్‌నగర్ క్రైం: ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఎండు గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. సీఐ వీరారెడ్డి, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారు జామున పట్టణంలోని అప్పన్నపల్లి బ్రిడ్జి సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో టీఎస్ 06ఈఈ 6393 నంబర్ కల్గిన బైక్‌పై ఆంజనేయులు, రాజ్‌కుమార్, రమేష్ 200 గ్రాముల ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితులు హైదరాబాద్‌లోని దూల్‌పేట్ ఏరియాలో ఎండు గంజాయి కొనుగోలు చేసి వస్తున్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు సీఐ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కళానందం, బబ్బిష్‌రెడ్డి, రమేష్, అంజి, కృష్ణ, వినోద్, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్కార్ట్ డ్యూటీ బాధ్యతగా నిర్వర్తించాలి

మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ

మహబూబ్‌నగర్ క్రైం: ఎస్కార్ట్ డ్యూటీ అత్యంత బాధ్యత కల్గిన అంశంగా భావించాలని, ఖైదీలను తరలించే రూట్, వాహనాలను మారుతున్న పరిస్థితుల ఆధారంగా తగిన భద్రతా ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని, ఖైదీల ఎస్కార్ట్ డ్యూటీల్లో పాల్గొనే పోలీస్ సిబ్బంది ఖైదీల నేర చరిత్ర, జైలులో వారి ప్రవర్తనను ముందుగానే తెలుసుకోవాలని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ అన్నారు. ఏదైనా సందర్భంలో ఖైదీ తప్పించుకుంటే అది పోలీస్ వ్యవస్థపై మచ్చగా మిగిలిపోతుందని హెచ్చరించారు. జోగుళాంబ జోన్-7 పరిధిలో ఉన్న ఐదు జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు ఇతర పోలీస్ అధికారులతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఖైదీల ఎస్కార్ట్ డ్యూటీలు, భద్రతా చర్యలు, జైలు-కోర్టు మధ్య సమన్వయం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. విచారణలో ఉన్న ఖైదీలు లేదా శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను కోర్టులకు లేదా ఆస్పత్రులకు తరలించే క్రమంలో అవసరమైన భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. జైలు, కోర్టు అధికారులతో కలిసి వైద్య సిబ్బందిని సమన్వయం చేసుకోవాలన్నారు. ఏ చిన్న నిర్లక్ష్యం కూడా సెక్యూరిటీ బ్రీచ్‌కు దారితీయొచ్చని, ఖైదీలను ఆస్పత్రులకు తీసుకెళ్లినప్పుడు పారిపోవడం, బయటి సంబంధాలు కలుపుకోవడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా రైతులు, మహిళలు, మైనర్లు, దివ్యాంగులు, వృద్ధులను తరలించే విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్కార్ట్ డ్యూటీ అనేది భద్రత పద్ధతులతో నడిపించాల్సిన ప్రత్యేక విధి అన్నారు. వాస్తవిక పరిస్థితుల ఆధారంగా ప్రతి ఖైదీకి రిస్క్ ప్రొఫైల్ రూపొందించి, అతనిపై ఎలా పర్యవేక్షణ కొనసాగించాలన్న అంశంపై వివరణాత్మక వ్యూహం తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీలు జానకి, వైభవ్ గైక్వాడ్, రావుల గిరిధర్, తోట శ్రీనివాస్ రావు, యోగేశ్ గౌతం, డీఎస్పీలు, రిజర్వ్ పోలీసులు అధికారులు పాల్గొన్నారు.



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ

ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ



జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న లారీలు



కాలిపోయిన లారీలోని ఆలుగడ్డలు

● పూర్తిగా దగ్ధమైన రెండు లారీలు
● రూ.10 లక్షల విలువైన ఆలుగడ్డలు బుగ్గిపాలు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టిన ఘటనలో రెండు లారీలు దగ్ధమైన ఘటన మండల పరిధిలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ మురళీ కథనం మేరకు.. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్ జిల్లా దావూద్ గ్రామానికి చెందిన అజారుద్దీన్ ఆర్‌జే 14 జీజే 0965 నంబర్ గల లారీలో ఆలుగడ్డల లోడుతో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా నుంచి బెంగుళూరుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వేములస్టేజీ వద్ద ఒక్కసారిగా లారీ ఇంజిన్ ఆగిపోవడంతో రోడ్డు పక్కగా ఆపి మరమ్మతు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఏపీ 21 టీజెడ్ 8969 నంబర్ గల బండల లోడుతో వెళ్తున్న లారీ అతివేగంతో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రెండు లారీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇరు లారీల డ్రైవర్లు, క్లీనర్లకు ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఫైరింజన్ల సాయంతో మంటలు అదుపుచేశారు. రెండు లారీలతో పాటు సుమారు రూ.10 లక్షల విలువైన ఆలుగడ్డలు బుగ్గిపాలైనట్లు డ్రైవర్ అజారుద్దీన్ వాపోయాడు. లారీ డ్రైవర్ అజారుద్దీన్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అలంపూర్ సీఐ రవిబాబు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు ఆరా తీశారు.

వేగవంతంగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్/ ధరూరు/ దోమలపెంట/ ఎర్రవల్లి: జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. శుక్రవారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

ఎత్తిపోతలకు నీటి విడుదల

జూరాల ప్రాజెక్టుకు ఎగువన కురిసిన వర్షాలతో ఇన్‌ఫ్లో వరద మరింత పెరిగింది. దీంతో భీమా లిఫ్టు-1 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు వదలగా.. మరో 65 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.682 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలానికి 92,789 క్యూసెక్కులు

జూరాలలో శుక్రవారం ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 31,852 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 58,722, సుంకేసుల నుంచి 2,215 కలిపి మొత్తం 92,789 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తుంది. ప్రస్తుతం శ్రీశైలంలో 849.5 అడుగుల వద్ద 78.9240 టీఎంసీల నీటి నిల్వ ఉంది.



బీచుపల్లి వద్ద నిండుగా ప్రవహిస్తున్న కృష్ణానది

శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరుగులు

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణానదికి వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి కృష్ణానది పుష్కర ఘాట్ దగ్గర శుక్రవారం కృష్ణమ్మ నిండుకుండలా ప్రవహిస్తూ శ్రీశైలం వైపు ఉరకలు వేస్తూ పరుగులు పెడుతుంది.

'పాలమూరు'కు జాతీయ హోదా ఇవ్వాలి

జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జుకృష్ణన్ డిమాండ్



పంపహౌజ్‌ను పరిశీలిస్తున్న కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, తదితరులు

కొల్లాపూర్ రూరల్: పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఎల్లూరు గ్రామ సమీపంలోని పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు మొదటి లిఫ్టును అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో కలిసి సందర్శించారు. పంపహౌజ్, ప్యానల్ బోర్డు, డెలివర్ పంపు పనులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రాజెక్టు పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన మ్యాపును పరిశీలించారు. ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి పాలమూరు జిల్లాలో 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది, ప్రజలకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్ సాగర్, సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, శ్రీనివాసుడు, కొల్లాపూర్ మండల సీపీఎం కార్యదర్శి శివవర్మ తదితరులు పాల్గొన్నారు.